క్లుప్తంగా

స్వాములకు అన్న సంతర్పణ



పాత గుంటూరు: స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వాములకు అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, ప్రముఖ అంతర్జాతీయ క్రికెటర్ అంబటి రాయుడు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం చైర్మన్ బాబు, పార్టీ నాయకులు రాచమంటి భాస్కర్, కుంటా బాబు, బాల, రెడ్డి సుబ్బులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ స్పందన రద్దు

నెహ్రూనగర్: మిచౌంగ్ తుపాను కారణంగా సోమవారం నగరపాలక సంస్థలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో స్పందన రద్దు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు



గుంటూరు మెడికల్: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేయడంతో ఆదివారం గుంటూరులో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో పెద్దఎత్తున బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సైతం బీజేపీ విజయ ఢంకా మోగిస్తుందని జిల్లా అధ్యక్షుడు నరేంద్రకుమార్ తెలిపారు. వేడుకల్లో మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, పాటిబండ్ల రామకృష్ణ, భీమినేని చంద్రశేఖర్, తాళ్లపాటి రవికుమార్, చెరుకూరి తిరుపతిరావు, సీహెచ్.కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యం అతి ప్రాచీనమని, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల్ని ఆయుర్వేద వైద్యంతో త్వరితగతిన నయం చేసుకోవచ్చని సూచించారు. ఈఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని దీర్ఘకాలిక వ్యాధులకు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొట్టకల్ ఆర్యవైద్యశాల కేరళ మందులతో వైద్యం, పంచకర్మ, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో చికిత్స ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాల్లో అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రూ. 50 వేల విలువైన ఆయుర్వేద మందుల్ని 200 మంది రోగులకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ సాయిగౌతమి, డాక్టర్ సుస్మిత, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ చరిష్మా, మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో మధువని సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు వి. మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. స్వరాల సంగమం పేరుతో నిర్వహించిన విభావరిలో పలు చిత్రాల్లోని పాటల్నిగాయకులు యస్. సాంబశివరావు, సీహెచ్. రవికాంత్, డి.టి. సాయిబాబా, పత్రి గాయత్రీదేవి, అత్తోట సౌజన్య, జరీనా ఆలపించారు. పి. కృష్ణారావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, కె. శివప్రసాదరావు పర్యవేక్షించారు.

విద్యార్థుల ఉన్నతికి గురువులే కారణం

రవాణా శాఖ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి



పూర్వ గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఉన్నతికి గురువులే కారణమని రవాణాశాఖ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బీహెచ్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థినుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల్ని సన్మార్గంలో నడిపించడంలో గురువులు తమ బోధన పటిమ, వ్యక్తిత్వంతో కృషి చేస్తారని తెలిపారు. బీహెచ్ హైస్కూల్ పూర్వ విద్యార్థినిగా తాను ఉన్నతస్థాయికి ఎదగడం వెనుక గురువులు పంచిన విజ్ఞానం, అలవర్చిన క్రమశిక్షణ కారణమని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బెంగుళూరు కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ రామరాజు అనురాధ మాట్లాడుతూ ప్రస్తుతం యువతరం ప్రతి చిన్న విషయానికీ ప్రతికూల దృక్పథాన్ని ఏర్పరచుకుంటున్నారని, జీవితంలో అన్నీ అనుకున్నట్లుగా ఎవ్వరికీ జరగవని చెప్పారు. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు జీవితాన్ని ధైర్యంగా మలచుకోవాలనేది నేర్చుకోవాలని చెప్పారు. నాటితరం విద్యార్థులు ప్రకృతిని, తోటివారిని పరిశీలించి విషయ పరిజ్ఞానంతో నాయకత్వ లక్షణాలు అలవర్చుకునేవారని వివరించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగం ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ.ఐదు లక్షల విరాళాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించారు. పూర్వ విద్యార్థిని వాణీ సుజాత మాట్లాడుతూ తమ సంఘ ఆధ్వర్యంలో పాఠశాలలో గ్రంథాలయాన్ని పునర్నిర్మించడంతో పాటు సోలార్ ప్యానెల్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన పూర్వ ఉపాధ్యాయుల్ని సత్కరించారు. ముందుగా బండ్లమూడి హనుమాయమ్మ విగ్రహానికి వ్యవస్థాపకురాల్లో ఒకరైన ఏక ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు కర్పూరపు శాంతి భూషణ్, కరస్పాండెంట్ దేశిరాజు సాయినాథ్, పూర్వ విద్యార్థినుల సంఘ చైర్‌పర్సన్ జయశ్రీ, కన్వీనర్ సంధ్యశ్రీ, అధ్యక్షురాలు డాక్టర్ రాజరాజేశ్వరి, కోశాధికారి శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె. లలిత, సభ్యులు సుమిత్ర, పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని భరత మాత పూజా దినోత్సవాలలో భాగంగా మూడో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రకాశనం చేశారు. వందేమాతరం ప్రార్థన గీతంతో పోటీల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతిరాత, ఇంద్రజాలం, దేశభక్తి బృంద గీతాల పోటీల్ని నిర్వహించారు. పిల్లల్లో దేశభక్తిని పెంచే పోటీల్ని ఏటా నిర్వహిస్తున్న సంస్థ కార్యవర్గాన్ని మస్తానయ్య అభినందించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా ఆర్య క్షత్రీయుల కార్తిక సమారాధన



సమారాధనలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

పాత గుంటూరు: శ్యామలా నగర్‌లోని శ్రీ సంతోషి మాత ఆలయ ప్రాంగణంలో ఆర్య క్షత్రీయుల సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు వీరభద్ర నాగరాజు, యకమా నాగేశ్వరరావు వర్మ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక సమారాధన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నిషామాంబ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. నగరానికి చెందిన పెద్దల్ని ఘనంగా సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా గడిపారు. మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. బహుమతుల్ని కామరుషి నాగ సురేష్, యకమా ఫణికుమార్ అందజేశారు. పిల్లల డాన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు వరమహేష్, నందిగం శ్రావణ్‌కుమార్, రాధాకృష్ణ, కనిగిరి శ్రీనివాస్, సాయి, వీరభద్ర సురేష్ ఖన్నా, యకమా రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

సందడిగా పద్మశాలీయ సంఘం కార్తిక వనసమారాధన



నారాకోడూరులో జిల్లా పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో మహిళల ఆటాపాటా

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు, వడ్లమూడి, వేజండ్ల పరిధిలోని మామిడి, సపోటా తోటలు ఆదివారం కార్తిక వనసమారాధనతో కిటకిటలాడాయి. గుంటూరు జిల్లా పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో నారాకోడూరులోని తోటలో వనసమారాధన సందడిగా సాగింది. గుంటూరు నగరంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జి.చిన వీరయ్య అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్గం పుల్లారావు, నాగార్జున యూనివర్సిటీ సెనేట్ మెంబర్ కన్నా మాస్టారు, ప్రముఖ న్యాయవాది యంగల కోటేశ్వరరావు (వైకే), అఖిల భారత పద్మశాలీయ సంఘం జాతీయ కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు తదితరులు మాట్లాడారు. పద్మశాలి కులస్తులు అన్ని రంగాల్లో గణనీయంగా రాణిస్తున్నారని, రాజకీయంగా కూడా కీలకపాత్ర వహించాలని ఆకాంక్షించారు. సంఘ నాయకులు రామనాథం పరమేశ్వరరావు, మురుగుడు శ్రీహరి, కస్తూరి వెంకటేశ్వర్లు, సూరేపల్లి వెంకటేశ్వర్లు, ఆనందపు వాసు, పడవల రఘురాం, అందే శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతుల్ని అందజేశారు.

ప్రాణాలు కాపాడటంలో జనరల్ మెడిసిన్ పాత్ర కీలకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: రోగుల ప్రాణాల్ని కాపాడటంలో జనరల్ మెడిసిన్ పాత్ర ఎంతో కీలకమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో ఆదివారం జనరల్ మెడిసిన్ వైద్యుల నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జనరల్ మెడిసిన్ విభాగానికి 23 పీజీ సీట్లు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. వైద్యులు చిరునవ్వుతో రోగులకు సేవలు అందించాలని తెలిపారు. జనరల్ మెడిసిన్ వైద్య విభాగంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, వాటిని తెలుసుకోవాలని చెప్పారు. ఒక రోగిని సమగ్రంగా పరీక్ష చేసే విభాగం కేవలం జనరల్ మెడిసిన్‌కే ఉందని తెలిపారు. వైద్యులందరూ తప్పనిసరిగా ఆప్రాన్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శైలజ, సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వి.వి.నారాయణరావు, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ సావిత్రి పాల్గొన్నారు.

జనరల్ సర్జరీ సీఎంఈ

గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఆదివారం జనరల్ సర్జరీ వైద్య విభాగం సీఎంఈ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జనరల్ సర్జరీ వైద్య విభాగంలో అద్భుతమైన ఆపరేషన్లు చేసి రోగుల ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. జనరల్ మెడిసిన్ నాలెడ్జ్ ఉంటే మంచి సర్జన్‌లుగా తయారు కావచ్చని సూచించారు. జనరల్ సర్జన్‌గా రాణించడానికి అవసరమైన లక్షణాల్ని వివరించారు. ఆపరేషన్లు సమయస్ఫూర్తితో చేయాలని, ధైర్యంగా ఉండాలని, పెదవులపై చిరునవ్వు ఎప్పుడూ ఉండాలని వెల్లడించారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సావిత్రి, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ భవనానికి త్వరలోనే స్థలం కేటాయింపు

తెనాలి: బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన, 118 మంది విద్యార్థులకు రూ.3.50 లక్షల ఉపకార వేతనాలు, నోట్‌పుస్తకాల పంపిణీ ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక తాలూకా జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరిషత్ భవనానికి త్వరలోనే స్థలం కేటాయించనున్నట్లు ప్రకటించారు. పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన వేదగంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వరప్రసాద్‌కు స్వర్ణకంకణ ధారణ చేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త ఓరుగంటి నవీన్, పినపాడులోని శృంగేరీ పీఠం దత్తన మంచి లక్ష్మీనరసింహశర్మ, పరిషత్ ఉపకార వేతనంతో చదువుకుని సింగపూర్‌లో ఉన్నతస్థాయిలో స్థిరపడిన చిలకలపూడి నాగహిమజను ఎమ్మెల్యే శివకుమార్ సత్కరించారు.

తాళాలు వేసిఉన్న ఇంట్లో అగ్ని ప్రమాదం

గుంటూరు ఈస్ట్: తాళాలు వేసి ఉన్న ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు... రాజ్యలక్ష్మీ నగర్‌లో తాళాలు వేసి ఉన్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ సర్వీస్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి తాళాలు పగులగొట్టి మంటలు ఆర్పారు. హైఓల్టేజీ కారణంగా ఆ కాలనీలోని పలు గృహాల్లో అనేక విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. స్థానికులు ఈ ఘటనపై ఆందోళన వెలిబుచ్చారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. ఇల్లు ఎవరిదో వివరాలు తెలియలేదు.

బాలిక ఆత్మహత్య

గుంటూరు రూరల్: బాలిక ఆత్మహత్యపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరిపాలెం ప్లాట్లుకు చెందిన మల్లెల అక్షయ(14) ఓబులునాయుడుపాలెం పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో స్థానికంగా తాపీ పని చేసే నవీన్ అనే యువకుడు ప్రేమపేరుతో వేధిస్తున్నాడని మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తండ్రి అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

భక్తులతో కళకళలాడిన కాకాని శివాలయం



పెదకాకాని: కార్తిక దీపాల కాంతులతో పెదకాకాని శివాలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. మూడో ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ప్రాకార మండపాల్లో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయం చుట్టుపక్కల ఎటు చూసినా దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులే కనిపించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తిక దీపాలు వెలిగించి, పూజలు చేసుకునే విధంగా టేబుళ్ల ఏర్పాటు చేశారు. తెల్లవారు జామునే భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. యజ్ఞాల బావి నీటితో పవిత్ర స్నానాలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. పొంగలి నైవేద్యాలతో, ప్రభలతో ఆలయం చుట్టూ హరోం హర అంటూ నామం స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లలో దాతలు ఉచితంగా వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఆలయంలో అధికంగా అంత్రాలయ అభిషేకాలు, దర్శనాలు, తలనీలాలు సమర్పణ, అన్నప్రాశనలు, నామకరణలు, వాహనపూజలు అధిక సంఖ్యలో జరిగాయి. ఒక్కరోజులో స్వామికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ. 7 లక్షల ఆదాయం, అన్నదానానికి రూ. 10.50 లక్షలు విరాళాలు సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రముఖ విద్యాసంస్థ అధినేత పార్థసారథికి ఘన నివాళి



మంగళగిరి: విజయవాడకు చెందిన ప్రముఖ విద్యావేత్త శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమి చైర్మన్ నరేంద్ర బాబు తండ్రి వెనిగళ్ల పార్థసారథి దశదిన కర్మ ఆదివారం నిర్వహించారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కన ఉన్న సీకే కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు పార్థసారథి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు.

నగరపాలక సంస్థలో కంట్రోల్ రూం ఏర్పాటు

నెహ్రూనగర్: మిచౌంగ్ తుపాను దృష్టిలో పెట్టుకొని గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూం 0863–2345103కి కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కడైనా చెట్ల కొమ్మలు విరిగితే తొలగించడానికి పార్క్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌కి ఆదేశాలు జారీ చేశారు. మంచి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ అంతరాయం సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా జనరేటర్లు ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. సచివాలయాల వారీగా కార్యదర్శులు, అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

17న రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలు



పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కల్యాణ్, సభ్యులు

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 17న రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. కల్యాణ్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కల్యాణ్ మాట్లాడుతూ సబ్ జూనియర్స్, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో వెస్ట్రన్, క్లాసికల్, ఫోక్ డాన్స్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 17న ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం మెగా ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 9వ తేదీలోపు పేర్లను 8897508897 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో కార్యదర్శి పి. అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శి వై. దుర్గారామ్, ఉపాధ్యక్షులు జె. చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు కృషిచేయాలి



సమావేశంలో ఆపస్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువల్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సంఘ కోర్ కమిటీ సమావేశంలో ప్రతినిధి వై. శ్రీహరి పూర్ణప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర మహిళా కన్వీనర్ పి. పద్మ మాట్లాడుతూ ఈనెల 17న జరగనున్న నారీశక్తి సమ్మేళనాన్ని మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.బాల చంద్రారెడ్డి, కె. శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పి. వీరబ్రహ్మం, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

- ప్రారంభించిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- ములుకుదురులో అనూహ్య స్పందన
- కంటి పరీక్షలకు భారీగా తరలివచ్చిన రెండు గ్రామాల ప్రజలు



శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): పొన్నూరు మండలం ములుకుదురు, మాచవరం గ్రామాల్లో ఆదివారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని స్థానిక గ్రామ పెద్దలతో కలసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కలల్ని తన ఆశయాలుగా స్వీకరించి, రాష్ట్ర చరిత్రలోనే ఎన్నికల మేనిఫెస్టోను నూటికి నూరు శాతం అమలు చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షతకు నిదర్శనమని తెలిపారు. ఆయన సేవల్ని స్ఫూర్తిగా తీసుకుని ఏడాది పొడవునా సంక్షేమ కార్యక్రమాల పరంపర కొనసాగిస్తూ, ఈ ఏడాదిని బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంగా ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గత 11 నెలల్లో వేలాది మందికి కంటి వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశామని పేర్కొన్నారు. పరీక్షలు జరిపిన ఏడు రోజుల్లో అక్కడే కళ్లజోళ్లు పంపిణీ చేయడం నేత్రజ్యోతి ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహించడానికి ముందుగానే ములుకుదురు, మాచవరం గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో బజరంగ్ సేవా విభాగం బృందం పర్యటించి, ఇంటింటికీ ప్రచారం చేసినట్లు చెప్పారు. శిబిరానికి వచ్చిన 1034 మందికి దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించినట్లు వివరించారు. గుంటూరుకు చెందిన ట్రికాన్ క్లినిక్ సహకారంతో 135 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించామని తెలిపారు. ప్రధానంగా తమ వైద్య శిబిరానికి ములుకుదురులో అనూహ్య స్పందన లభించడం అభినందనీయమని తెలిపారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఈ శిబిరానికి రాకపోకల కోసం ప్రత్యేక వాహనాన్ని సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

యూటీఎఫ్ నేత దత్తుకు ఘన నివాళి



గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ సీనియర్ నాయకుడు ఎంఏకే దత్తు మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎంఏకే దత్తు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో శనివారం తుది శ్వాస విడిచిన దత్తు భౌతిక కాయాన్ని ఆయన కోరిక మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగుల గొట్టిన ముగ్గురిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ముగ్గురు వ్యక్తులు కారు అద్దాలు పగుల గొట్టిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీపురం 3వ లైనులో ఉడుముల వెంకటేశ్వరరెడ్డికి ఎడ్యుకేషనల్ కన్సల్‌టెన్సీ ఉంది. శనివారం రాత్రి ఆయన కారు పార్కింగ్ చేసే విషయంలో ముగ్గురు వ్యక్తులతో ఘర్షణ జరిగింది. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయి మళ్లీ వచ్చి వెంకటేశ్వరరెడ్డి కారు అద్దాలు పగుల గొట్టారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19 మంది జూదరుల అరెస్టు

వేర్వేరు చోట్ల పేకాడుతున్న 19 మందిని పోలీసులు అరెస్టు చేశారు. చంద్రమౌళీనగర్ 7వ లైనులో కొందరు పేకాట ఆడుతున్నరన్న సమాచారం అందుకున్న పట్టాభిపురం పోలీసులు ఆదివారం దాడి చేశారు. 10 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. రూ. 1,10,300తో పాటు 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- ఏసుభక్త నగర్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న నగరంపాలెం పోలీసులు ఆదివారం దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి, రూ. 54,370తో పాటు తొమ్మిది సెల్‌ఫోన్లు, ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.